ప్రజాశక్తి

ఆదివారం 12 మే 2024 పేజీలు 8



విజయనగరం



పార్వతీపురం మన్యం




ప్రచారం.. పరిసమాప్తం

- నేటి సాయంత్రం వరకు ఇంటింటి ప్రచారానికి అనుమతి
- జిల్లాలో 144 సెక్షన్ అమలు
- విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంపిణీ
- నిద్రావస్థలో నిఘా వ్యవస్థ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. పోలింగ్‌కు ఇంకా ఒక్కరోజు మాత్రమే సమయం ఉండడంతో చివరి రోజు అభ్యర్థులంతా ప్రచారాన్ని హోరెత్తించారు. ఎక్కడికక్కడ బైక్ ర్యాలీలు, ఇంటింటి ప్రచారం చేపట్టారు. సాయంత్రం 6గంటల తరువాత ప్రచార బాకాలన్నీ మూగబోయాయి. ఆదివారం సాయంత్రం వరకు ఇంటింటి ఎన్నికల ప్రచారానికి ఎన్నికల సంఘం అనుమతిచ్చింది. అభ్యర్థులు యాడ్‌లు ఇచ్చుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతిచ్చింది. ప్రచారం గడువు ముగియడంతో జిల్లా వ్యాప్తంగా అన్నిచోట్ల 144 సెక్షన్ విధించింది. దీని ప్రకారం ఐదుగురి కంటే ఎక్కువ మందితో ప్రచారానికి వెళ్లకూడదని కూడా షరతు విధించింది. ఇతర జిల్లాలకు చెందిన వారెవరూ నియోకవర్గాల్లో ఉండేందుకు అనుమతి లేదని జిల్లా ఎన్నికల అధికారులు ప్రకటించారు. బహిరంగ ప్రచార ముగియడం, పోలింగ్ మరికొన్ని గంటల్లోనే ప్రారంభం కానుండడంతో ఓటర్లను లోబరుచుకునేందుకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు సిద్ధమయ్యాయి. డబ్బు, మద్యం పంపకాలు విచ్చలవిడిగా చేస్తున్నాయి. వందల కోట్ల రూపాయల డబ్బు, లారీల కొద్దీ మద్యం జిల్లాకు చేరింది. మందుబాబులు పూటుగా తాగి చిందులేస్తున్నారు. నాయకులు, కార్యకర్తలు డబ్బు, మద్యం పంపిణీలో తలమునకలయ్యారు. పోటాపోటీగా పంపకాలు చేస్తున్నప్పటికీ, కేసులు నమోదు చేయాల్సిన నిఘా వ్యవస్థ నిద్రావస్థలో ఉంది. అధికారులు సిబ్బంది మాటలకే పరిమితమయ్యారు. ఒక పార్టీ నేరుగా మండల, గ్రామ స్థాయి నాయకుల ద్వారా డబ్బు పంపిణీ చేస్తుండగా, మరో పార్టీ వివిధ జిల్లాలకు చెందిన 70నుంచి 100మంది వరకు నియోజకవర్గాలకు రప్పించి, వారి ద్వారా పంపకాలు చేపడుతోంది. దీంతో, స్థానిక నాయకులుగా తమను గుర్తించలేదంటూ ఆ పార్టీకి చెందిన గ్రామ స్థాయిట నాయకులు లోలోపల మదన పడుతున్నారు. ఇరు పార్టీలు ఓటుకు రూ.1000 నుంచి రూ.3000 వరకు ఎరజూపుతున్నారు. అయితే పార్టీ అభ్యర్థులు కొంతమొత్తం పంచాలని చెబితే మండల స్థాయి నాయకులు అందులో కొంత నొక్కేసి తక్కువ పంచుతున్నారంటూ దిగువస్థాయి కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గజపతినగరం నియోజకవర్గంలో అధికార



పార్టీ నుంచి తక్కువ మొత్తంలో డబ్బులు పంపిణీ చేసేందుకు ఇవ్వడంతో మండల స్థాయి నాయకులంతా తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలిసింది. ఈనేపథ్యంలో గత్యంతరం లేక వారికి నచ్చిజెప్పి మరుచటి రోజు ఓటుకు రూ.1500 చొప్పున పంపిణీ చేసేందుకు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులున్నా మద్యం, డబ్బు (మిగతా..3లో)



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి
- శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు : ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. ప్రతీఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకొని, జిల్లాలో శతశాతం ఓటింగ్ నమోదుకు కృషి చేయాలని ఆమె కోరారు. జిల్లా ఎస్‌పి దీపికతో కలిసి, కలెక్టరేట్‌లో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు చేసిన ఏర్పాట్లను వివరించారు.

జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ అన్నారు. ఇప్పటికే 99 శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయ్యిందన్నారు. మిగిలిపోయిన వారికి పోలింగ్ రోజున పంపిణీ చేసేందుకు బూత్‌ల వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పిడబ్ల్యూడి ఓటర్ల కోసం ప్రత్యేకంగా ఓటర్ గైడ్‌లను పంపిణీ చేశామన్నారు. 85ఏళ్ల దాటిన వృద్ధులకు, 40 శాతం వైకల్యం దాటిన విభిన్న ప్రతిభావంతులకు హోం ఓటింగ్ సౌకర్యాన్ని కల్పించామని, ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది అందరికీ పోస్టల్ ఓటింగ్‌కు అవకాశాన్ని కల్పించామని తెలిపారు. జిల్లాలో సుమారు 15,62,921 మంది ఓటర్లు ఉన్నారని, 1847 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాలను కల్పించామని తెలిపారు. ఇవికాకుండా ఎండ నుంచి రక్షణ కోసం టెంట్లు, అవసరమైన కుర్చీలు ఏర్పాటు చేస్తున్నామని, బూత్‌లవద్ద వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లాలో 362 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అక్కడ (మిగతా..3లో)



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం శ్రేణులు

సిపిఎంతోనే గిరిజనులకు రక్షణ

మన్యంలో ముమ్మరంగా సిపిఎం ప్రచారం

ప్రజాశక్తి - కురుపాం

సిపిఎంతోనే గిరిజన హక్కులకు రక్షణ అని కురుపాం నియోజకవర్గ సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ అన్నారు. రానున్న ఎన్నికల్లో ఇండియా బ్లాక్ బలపర్చిన సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలో వలసబల్లేరు పంచాయతీలో గల గిరిశిఖర గ్రామాలైన ఆగంగూడా, వలసగూడ, వెలగమానుగూడ, చాపరాయి గూడ, వలస బల్లేరు తదితర గిరిజన గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తమకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి పదేళ్ల పాలనలో రాజ్యాంగానికి విరుద్ధంగా గిరిజనుల హక్కులైన అడవులను అటవీ ఫలసాయాలను దూరం చేస్తూ హక్కులను (మిగతా..3లో)

కుక్కల స్వైరవిహారం

- బహిర్భూమికి వెళ్లిన వృద్ధురాలిపై దాడి
- ఒకరు మృతి, పలువురికి గాయాలు
- పశువులు, గొర్రెలపైనా దాడి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస/మక్కువ

జిల్లాలో పలుచోట్ల కుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలు, పశువుల ప్రాణాలను తీస్తున్నాయి. శనివారం పలుచోట్ల కుక్కల దాడిలో ఓ వృద్ధురాలు మృతి చెందగా, పలువురు గాయపాలయ్యారు. అలాగే గొర్రెలను, ఆవుదూడలను పొట్టన పెట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

జియ్యమ్మవలస మండలం వెంకటరాజపురానికి చెందిన బంటు లక్ష్మి (70)ను గ్రామ సమీపంలో శనివారం ఉదయం బహిర్భూమికి వెళ్లింది. ఆ సమయంలో సుమారు ఒక్కసారిగా 8 కుక్కల గుంపు దాడి చేసి లక్ష్మి తలపై భాగాన్ని, రెండు కాళ్లను కొరికేశాయి. దీంతో ఆమె పెద్దగా కేకలు పెట్టడంతో చుట్టుపక్కల వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే వారు వచ్చినప్పటికే ఆ మృతి చెందింది. కుదమ పంచాయతీ గౌరీపురంలో శనివారం సాయంత్రం పిచ్చి కుక్క స్వైర విహారం చేసి గ్రామానికి చెందిన చిన్నారి ఈదుబిల్లి పల్లవి, రాజాపు నారాయణరావు, రాజపు ఎర్రమ్మ, గేదెల శివున్నాయుడును గాయపర్చాయి. గునుపూరు శ్రీనివాసరావుకు చెందిన ఆవు, శంబంగి తిలక్‌కు చెందిన ఆవు దూడకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారంతా పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి చికిత్స కోసం వెల్లడించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇదే గ్రామంలో పదిరోజుల క్రితం గొడబ సరోజిని, అలజంగి పార్వతి, ఎం.లక్ష్మిని గాయపర్చడంతో వారు చావు బతుకుల మధ్య అల్లాడుతున్న పరిస్థితి ఏర్పడింది. ఈ కుక్కల దాడుల్లో గతం లో అనేక గొర్రెలు, ఆవు దూడలు మరణించిన సంగతి తెలిసిందే.

మక్కువ : మండలంలోని దబ్బగెడ్డకు చెందిన కోడి పోలీస్ తను మేకలను మేపునకు తీసుకెళ్లాడు. పొలంలో అప్పటికే పామాయిల్ తోట వద్ద ఉన్న కుక్కల గుంపు ఒక్కసారిగా మేకలపై దాడి చేశాయి. భయాందోళనకు గురైన పోలీసు కేకలు వేయడంతో పొలంలో ఉన్న వారు వచ్చేసరికి ఒక మేక పిల్లను చంపి తినేశాయి. ఆ ప్రాంతంలో మేకల మేపుతున్న దాసరి సాయిపై (మిగతా..3లో)



కుక్కల దాడిలో గాయపడిన మహిళ (ఫైల్)

ఆఖరిరోజు హోరెత్తిన ప్రచారం

• పోటా పోటీ ర్యాలీలు • ప్రచారంలో మాటల తూటాలు • గెలుపుపై ఎవరి అంచనాలు వారివే

ప్రజాశక్తి- చీపురుపల్లి

ఎన్నికల ప్రచారానికి చివరి రోజు కావడంతో ఇరు పార్టీలు శనివారం తమ ప్రచారాన్ని తారా స్థాయికి తీసుకెల్లాయి. చీపురుపల్లి నియోజకవర్గంలో అభ్యర్థుల తరుపున తమ నాయకులు ప్రచారాన్ని హోరెత్తించారు. పార్టీల నాయకులు ఎవరికి వారే మండల స్థాయి, గ్రామ స్థాయి నాయకులతో పాటు కార్యకర్తల్లోనూ ఉత్సాహాన్ని నింపారు. ఒకరికి మించి మరొకరు పై చేయి సాధించేలా ఓట్లు రాబట్టేందుకు నానా తంటాలు పడ్డారు. వైసిపి మండల కేంద్రంలో సుమారు ఐదు వేల మందితో భారీ ర్యాలీ చేపట్టింది. ఈ ర్యాలీలో పాల్గొన్న జిల్లా పార్టీ అద్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసరావు, మండల పార్టీ అద్యక్షుడు ఇప్పిలి అనంతం, యువజన విభాగం జిల్లా ఉపాద్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ ఓటును రాబట్టేందుకు, ఓట్లను తమవైపు తిప్పుకునేందుకు హామీల వర్షం కురిపించారు. టిడిపి తరుపున కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంకటరావు చీపురుపల్లి, గరివిడి పట్టణాలలో భారీ ర్యాలీలు చేపట్టారు. చీపురుపల్లిలో టిడిపి, వైసిపి, బిఎస్‌పి, కాంగ్రెస్ పార్టీలతో మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో ఉన్నప్పటికీ టిడిపి, వైసిపిల మద్యే ప్రధానమైన పోటీ జరుగుతోంది. తమ సిట్టింగ్ సీటుని కాపాడుకునేందుకు వైసిపి అభ్యర్థి ప్రస్తుత విద్యాశాఖా మంత్రి బొత్స సత్యన్నారాయణ శ్రమిస్తున్నారు. గతంలో ఎచ్చెర్లలో పోటీ చేసి ఓడిపోయిన కిమిడి కళావెంకటరావు ఈసారి చీపురుపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఎలాగైనా చీపురుపల్లి నుంచి గెలవాలని సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ఎవరికి వారు ఎత్తులకు పైఎత్తులు వేస్తూ ముందుకు సాగుతున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో ప్రచారం చివరి రోజు కావడంతో అభ్యర్థులు తమ అంతరింగుకులతో లోటు పాట్లుపై సమాలోచనలు జరుపుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం చీపురుపల్లి నియోజక వర్గంలో వైసిపి, టిడిపిల మద్య గట్టి పోటీ జరుగుతోంది. ఈ పోటీలో పై చేయి సాధించేందుకు రెండు పార్టీలు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులపై అంచనాలు వేస్తున్నారు. ఇతర పార్టీల నాయకుల్లో చీలికల తీసుకొచ్చి తమవైపు తిప్పుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.

డబ్బులు, మద్యం పంపిణీ చేస్తారా

గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా ప్రస్తుత జరుగుతున్న ఎన్నికలలో డబ్బులు, మద్యం పంపిణీ చేస్తారా..లేదా అని ప్రజలు గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. ఏ ఒక్కరి నోట విన్న ఇదే మాట వస్తోంది. నలుగురు కలిసిన ప్రతీ చోట ఎన్నికలపై మాట్లాడుతూ నేటి నుండే డబ్బు మద్యం వస్తాయంటూ చర్చించుకుంటున్నారు. దీనిని బట్టి చూస్తే పంపిణీ ఎవరైతే ఎక్కువ చేస్తారో వారికి గెలుపు అవకాశాలు ఉంటాయనేది అర్ధమవుతుంది. ఎన్నికల్లో ప్రజలు విలక్షణమైన తీర్పు ఇస్తారని రాజకీయ విశ్లేషకులు బావిస్తున్నారు. ఎన్నికల్లో పై చేయి ఎవరు సాధిస్తారో తెలియాలంటే ఈ నెల 13 వరకు వేచి చూడాల్సిందే.


చీపురపల్లిలో ప్రచారం చేస్తున్న కళా వెంకటరావు


చీపురపల్లిలో ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

ఎవరి అంచనాలు వారివి..

ప్రజాశక్తి- మెరకముడిదాం

చీపురుపల్లి నియోజకవర్గంలోని కీలకమైన మండలంగా మెరకముడిదాంకు గుర్తింపు ఉంది. ఈ నియోజకవర్గంలో ఏ పార్టీకైనా గెలుపును డిసైడ్ చేసే మండలంగా పేరుంది. మండలంలో మొత్తం 46,869 మంది ఓటర్లున్నారు. ఇటువంటి కీలకమైన మండలంలో వైసిపి నుంచి టిడిపిలో పలువురు చేరిపోవడంతో వైసికి నష్టజరిగే అవకాశం ఉందని టిడిపి నాయకులు అంచనా వేస్తున్నారు. అయితే సంక్షేమానికి ప్రజలు పట్టం కడతారన్న దీమాతో వైసిపి పెద్దలు ప్రచారం చేస్తున్నారు. మండలంలోని చినబంటుపల్లికి చెందిన మాజీ ఎంపిపి, వైసిపి నాయకులు కోట్ల మోతిలాల్ నాయుడు టిడిపిలోకి చేరారు. గర్భాం మేజర్ పంచాయతీకి చెందిన మాజీ ఎంపిపి తాడ్డి కృష్ణారావు కుమారుడు తాడ్డి చంద్ర శేఖర్ వైసిపి నుండి టిడిపిలోకి వెళ్లారు. దీని వల్ల మండలంలో కొంతవరకు వైసిపికి నష్టం అయినప్పటికీ వీరంతా వైసిపి నాయకులు బొత్స సత్యనారాయణ వర్గీయులే కావడంతో ఓటు తమకే వేస్తారన్న దీమాతో ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో బొత్సకు అడ్డాగా ఉన్న ఈ మండలంలో ఈ సారి టిడిపిలో చేరికల పెరిగాయి. గత ఎన్నికల్లో ఈ మండలం నుంచి 9 వేలకు పైగా వైసిపికి మెజార్టీ వచ్చింది. తాజా ఎన్నికలలో గత మెజారిటీ కంటే తక్కువ వచ్చినా విజయం సాధిస్తారన్న ధీమాతో ఉన్నారు. అయితే టిడిపిలో చేరికతో పాటు కూటమి అభ్యర్థి కూడా బలమైన నాయకుడు కావడంతో ఈ సారి గట్టి పోటీ నెలకొందన్న వాదన వినిపిస్తోంది.

మతతత్వ బిజెపిని ఓడించాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

సార్వత్రిక ఎన్నికల్లో మతతత్వ బిజెపిని ఓడించి ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కార్మికులకు సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 10ఏళ్ల బిజెపి పాలనలో ప్రజా వ్యతిరేక విధానాల వల్ల కార్మిక, కర్షక వర్గం తీవ్రంగా నష్టపోయిందన్నారు. కార్మికులు నష్టపోయి యాజమాన్యాలు లాభపడేలా కార్మిక నల్ల చట్టాల తీసుకువచ్చిన బిజెపికి ఓటుతో తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్లు చేతిలో వ్యవసాయ రంగాన్ని పెట్టడానికి మోడి నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అనేక చట్టాల తీసుకు వచ్చిందన్నారు. రైతాంగం కూడా ఎన్నికల్లో బిజెపికి తగిన బుద్ధి చెప్పి ఇంటికి పంపించాలని కోరారు. మరోసారి బిజెపికి అవకాశం ఇస్తే రాజ్యాంగం మార్పు చేసి మత తత్వ దేశంగా తీర్చిదిద్దే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.


విచారణ చేపడుతున్న అధికారులు

కెజిబివి ఉద్యోగిపై విచారణ

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని దేవుదల కస్తూరిబా గాంధీ పాఠశాలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఎం.స్వర్ణ కుమారిపై ఎంపిడిఒ శ్యామల కుమారి, ఎంఇఒ ఎం.వరప్రసాదరావు, ఎరకయ్యలు శనివారం విచారణ చేపట్టారు. ఈ నెల 2న రాజకీయ పార్టీ జనసేన తరుపున పాలకొండ నియోజకవర్గానికి వచ్చిన ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు గుమ్మడికాయతో హారతి ఇచ్చినట్లు వైసిపి లీగల్ సెల్ జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం సాధారణ ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ తరపున ఏ రకమైన కార్యకలాపాలూ ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టకూడదని నిబంధనలు ఉల్లంఘించి పాల్గొన్నందున ఈసీ నియమ నిబంధనల ప్రకారం నడుచుకోకపోవడంపై విచారణ చేపట్టామని అధికారులు తెలిపారు. స్వర్ణ కుమారి వాంగ్మూలం రికార్డు చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని విచారణ అధికారులు తెలిపారు.


సామగ్రి పంపిణీకి సిద్ధమైన ప్రాంగణం

ఎన్నికల సామగ్రి పంపిణీకి సిద్ధం

ప్రజాశక్తి- రేగిడి

ఎన్నికల సామాగ్రి పంపిణీకి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు రాజాం నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక ఐటిఐ ప్రాంగణంలో ఎన్నికల నిర్వహణ సామాగ్రి పంపిణీకి సంబంధించిన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 12న ఉదయం నుంచి సామాగ్రి పంపిణీ చేస్తారు. ఇవిఎంలు, మెటీరియల్ అన్ని అధికారులకు అందిస్తారు. అక్కడ నుంచి సిబ్బందిని కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో తరలిస్తారు. ఎన్నికలకు 2009 మంది సిబ్బందిని నియమించారు. 688 మంది పిఒలు, ఎపిఒలుగా, 1321 మంది ఒపిఒలుగా నియమించారు. 30 సెక్టార్లకు సంబంధించి రూట్‌లు ఏర్పాటు చేశారు. ఒకే రూట్‌లో 12 పోలింగ్ స్టేషన్లు ఉండే కేంద్రాలు కూడా ఉన్నాయి. 49 బస్సులను సిద్ధం చేశారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా ఇప్పటి వరకూ రూ.18లక్షల నగదు, 12కిలోల వెండి వస్తువులు, 7282 కరపత్రాలను సీజ్ చేసినట్లు ఆర్ఒ జోసేఫ్ తెలిపారు.

ఏకంగా ఊళ్లనే కొనేశారు

• హారతుల పేరుతో నగదు పంపిణీ
• పూసపాటిరేగలో ఓటుకు రూ.1000

ప్రజాశక్తి- రేగిడి

రాజాం నియోజకవర్గంలోని రేగిడి, వంగర, సంతకవిటి, రాజాం మండలాలలో సార్వత్రిక ఎన్నికలు మరో రెండు రోజుల్లో జరగనున్న నేపథ్యంలో వైసిపి నేతలు ఓటర్లను నగదు ఇచ్చి ఊరు ఊర్లనే కొనేసినట్లు తెలిస్తోంది. మరి కొన్ని గ్రామాల్లో కావలసిన మెటీరియల్, పంట పొలాలకు, కూరగాయలు పండించేందుకు పంట భూములకు బోర్లు వేస్తున్నారు. ఇంకొన్ని గ్రామాల్లో హారతులు పేరుతో నగదు పంపిణీ చేస్తున్నారు. గ్రామస్థాయి నాయకులు అనుమతులు లేకుండా డీజేలు, డాన్స్‌లు, తప్పెటగుళ్లు, పులి వేషాలు వంటివి ఏర్పాటు చేసి ఆడ, మగ తేడా లేకుండా నృత్య ప్రదర్శనలు చేస్తున్నారు. రాజీనామాలు ఇచ్చిన వాలంటీర్లు ఏకంగా జగన్ స్టిక్కర్లు అంటించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మండలంలోని రేగిడి, ఆమదాలవలస గ్రామాల్లో టిడిపి మాజీ అధ్యక్షులు, చీపురుపల్లి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకట్రావు సోదరుడు కిమిడి రామకృష్ణంనాయుడు వైసిపిలో చేరి ఈ రెండు గ్రామాల్లో ఇంటింటికి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్, ఎమ్‌పి అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్‌కు మద్దతుగా డమ్మి ఈవిఎంలతో ఇంటింటి ప్రచారం చేస్తూ ప్రతి ఇంటికి హారతులు ఇచ్చేలా ఏర్పాటు చేసుకుని రూ.500 నుంచి రూ.1000 వరకు నగదు పంపిణీ చేశారు. దీంతో ఈ రెండు గ్రామాల ప్రజలు నగదు పంపిణీ చేయడంతో ఔరా అని ముక్కున వేలేసుకున్నారు. 1983 నుంచి తెలుగుదేశం ప్రభుత్వంలో అనేక పదవులు అలంకరించిన ఆయన టిడిపికి ప్రచారం చేస్తున్నారని హారతులు ఇచ్చారు. అయితే ఈ ఎన్నికల్లో వైసిపికి మద్దతు ఇస్తూ డమ్మీ ఇవిఎంలతో వైసిపికి ఓటు వేయాలని కోరడంతో గ్రామస్తులు నివ్వరపోయారు. వైసిపి సర్పంచులున్న గ్రామాల్లో వారికి, సర్పంచులు లేని గ్రామాల్లో గ్రామస్థాయి నాయకులకు నగదు అందించి పంపిణీ చేయించినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది.

ఓటుకు వెయ్యి..?

విచ్చలవిడిగా నగదు పంపిణీ

పూసపాటిరేగ: ప్రజాసామ్యంలో ఓటు విలువను కూనీ చేసారా అంటే అవుననే చెప్పాలి. స్వాతంత్ర్యం వచ్చి ఇప్పిటి వరకూ జరిగిన ఎన్నికల్లో ఏనాడు ఇంత విచ్చలవిడిగా ఓటు విలువను కూనీ చేయలేదు. కానీ నేడు ఆ పద్ధతికి పాలకు పుల్‌స్టాప్ పెట్టి ఓటుకు వెయ్యి రూపాయలు ధర పెట్టారు. మరో పార్టీ అయితే మరో రూ. 1000 అదనంగా ఇస్తుంది. ఇదీ గాక పరిస్థితిని బట్టి, ఇంటిలో ఓట్లు బట్టి లెక్కలు గడుతున్నారు. ఈవిధంగా విచ్చలవిడిగా ప్రదాన పార్టీలు చేయడం ఓటర్లు ముక్కున వేలేసుకుంటున్నారు. గతంలో దొంగ చాటుగా, రాత్రి పూట వచ్చి బ్రతిమిలాడుకొని తాయిలాలు ఇచ్చేవారు. కానీ నేడు ఆపరిస్థితికి స్వస్తి చెప్పారు. ఇరు పార్టీలు నగదు పంపకాలపై ఎటువంటి ఫిర్యాదులూ చేయకూడదని నిర్ణయించుకుని పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తోంది. ఇందులో భాగంగానే అందుకే వైసిపి నేతలు ఒక వీధిలో పంచుతుంటే, కూటమి నేతలు మరో వీధిలో పంపకాలు సాగిస్తున్నారు. ఏ పార్టీ అయినా పర్యాలేదు ఓటు ఉంటే రేటు కట్టేస్తున్నారు. తాము ఇచ్చి వెల్లిన వెంటనే మరో పార్టీ వారు వచ్చి ఇస్తారని వారే చెబతుతున్నారు. ఎవరు ఎంత ఇచ్చినా తీసుకొని ఓటు మాత్రం మాకే వేయాలంటూ కోరుతున్నారు. అంటే ఈ ఎన్నికల్లో డబ్బు ఏ లెక్కలో ఖర్చు చేస్తున్నారో అర్ధమవుతోంది. ఈ తతంగమంతా అధికార్లుకు తెలిసినా కన్నెత్తి చూడడం లేదు. ఎందుకంటే ప్రజలకు అందుతున్న డబ్బులను ఎందుకు ఇబ్బంది పెట్టాలన్న నిర్ణయానికి వచ్చినట్లున్నారు. గ్రామాల్లో ఓటర్లు కూడా తక్కువేమి కాదు. తమ ఏరియాకు ఎందుకు ఇంకా రాలేదంటూ ఫోన్‌లు చేస్తున్నారు. ఆ పార్టీ వారు వచ్చి ఇచ్చి వెల్లిపోయారు. మీరు ఎప్పుడు వస్తారని అడుగుతున్నారు. ఇంకొంత మంది అయితే మా పేటలో ఇంత మందిమి ఉన్నాం. మా కుటుంబంలో ఇంత మంది ఓటర్లు ఉన్నారు. ఓల్‌సేల్‌గా మాట్లాడండి అంటున్నారని రాజకీయ నేతలు వాపోతున్నారు. గత పాలకులు ఏం చేసారు... వచ్చిన వారు ఏం చేస్తారు అన్నది చర్చ కాదు.. ఇప్పుడు మాకు ఎంత ఇస్తారో చెప్పండి అన్నదే చర్చ అన్న చందంగా ఓటర్లు ఉండడం నేతలకు అంతుబట్టడం లేదు. అంటే ప్రజాసామ్యంలో బలమైన ఆయుదం విలువ ఎంత దిగజారిపోయిందో అర్ధమవుతోంది. ఈ ప్రలోబాలు ఎవరి గెలుపు, ఓటమిలు మీద ప్రబావం చూపుతాయో వేచి చూడాల్సిందే.


రేగిడి: హారతి పల్లెంలో డబ్బులు పెడుతున్న వైసిపి నాయకులు

రిసెప్షన్ కేంద్రాల్లో ముమ్మరంగా ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయనగరంకోట, టౌన్

పోలింగ్ పూర్తయిన అనంతరం జిల్లాలోని వివిధ అసెంబ్లీ నియోజక వర్గాల నుంచి ఎన్నికల సిబ్బంది తీసుకువచ్చే ఎల్రక్టానిక్ ఓటింగ్ యంత్రాలను స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించేందుకు జిల్లా కేంద్రంలో ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లాలో అన్ని నియోజక వర్గాల ఇవిఎంలు భద్రపరిచేందుకు, ఓట్లు లెక్కింపు కోసం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాల మేరకు లెండి ఇంజనీరింగ్ కళాశాల, జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. లెండి ఇంజినీరింగ్ కళాశాలలో రాజాం, నెల్లిమర్ల, చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల స్ట్రాంగ్ రూంలు, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాట్లు జరుగుతున్నాయి.

జెఎన్‌టియులో విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాల ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రెండు ప్రదేశాల్లో రోడ్లు భవనాలశాఖ ఎస్ఇ విజయరత్నం ఆధ్వర్యంలో రిసెప్షన్ కేంద్రాల కోసం ప్రత్యేక జర్మన్ హేంగర్ లను ఏర్పాటు చేసి వర్షంలో కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గానికి పది సాధారణ కౌంటర్‌లు ఏర్పాటు చేసి రిసెప్షన్ కేంద్రాలకు మెటీరియల్, ఇవిఎంలు, ఇతర సామాగ్రి తీసుకువచ్చే ఎన్నికల సిబ్బంది నుంచి త్వరగా స్వీకరించే ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆయా కేంద్రాలకు చేరుకొనే సిబ్బంది రిసెప్షన్ కేంద్రాల్లో మెటీరియల్ అప్పగించిన అనంతరం రాత్రి భోజనం చేసి వెళ్లేందుకు వీలుగా జెఎన్‌టియు కేంద్రంలో 10 నుంచి 12 వేల మందికి సరిపడేలా భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోస జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు జరుగు తున్నాయి. వివిధ నియోజక వర్గాల నుంచి వచ్చిన సిబ్బందికి అవసరమైన సిబ్బందికి సమాచారం ఇచ్చేందుకు హెల్ప్ డెస్క్ లు కూడా ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాల ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు ఒకేసారి వచ్చినపుడు వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు.

పర్యవేక్షించిన కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



రిసెప్షన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

జెఎన్‌టియు., లెండి ఇంజినీరింగ్ కళాశాలను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి శనివారం పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సిబ్బంది నుంచి మెటీరియల్ ను త్వరగా స్వీకరించే విధంగా ఏర్పాట్లు వుండాలని సూచించారు. అన్ని నియోజక వర్గాల కౌంటర్లను కలెక్టర్ పరిశీలించి ఏర్పాట్లపై ఆరా తీశారు. పర్యటనలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, ట్రైనీ సహాయ కలెక్టర్ సహాదిత్ వెంకట్ త్రివినాగ్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, మెప్మా పీడీ సుధాకర్, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్అండ్‌బి ఎస్ఇ విజయరత్నం తదితరులు ఉన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

మరింత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని చెప్పారు. వికలాంగులు, యువత, మహిళల కోసం మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ నియోజకవర్గంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, ఆదివారం ఉదయం నుంచే ఇవిఎంల డిస్ట్రిబ్యూషన్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఎన్నికల సామగ్రిని తరలించేందుకు వినియోగించే వాహనాలకు జిపిఎస్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు తగిన జాగ్రత్తలను తీసుకున్నామని, ఓటర్లు ఎటువంటి అనుమానాలను పెట్టుకోవద్దని సూచించారు. అంధుల కోసం బ్రెయిలీలో నమూనా ఓటర్ల జాబితాను పోలింగ్ కేంద్రాలవద్ద ఏర్పాటు చేస్తున్నామని, అదేవిధంగా బ్రెయిలీ ఓటర్ స్లిప్పులను పంపిణీ చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలవద్ద 716 వీల్ ఛైర్లను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేస్తున్నామని, వివిధ వేదికల ద్వారా ఫిర్యాదులు స్వీకరించి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎంసిసి బృందాల ద్వారా నేటినుంచి మరింత విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తాయని తెలిపారు. జిల్లాలో 1136 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. శనివారం సాయంత్రం 6 గంటల తరువాత ప్రచారాన్ని ఆపివేయాలని స్పష్టం చేశారు. ఇంటింటి ప్రచారం చేసుకోవచ్చునని, ఐదుగురికి మాత్రమే అవకాశం ఉందని తెలిపారు. పోలింగ్ ఏజెంట్లను నియమించే అవకాశం కేవలం అభ్యర్థికి, లేదా ఎలక్షన్ ఏజెంట్‌కు మాత్రమే ఉందని చెప్పారు. పోలింగ్ రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోలింగ్ బూత్‌లలో ఏజెంట్‌లను మారేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో జిల్లాలో సుమారు 80శాతం ఓటింగ్ నమోదయ్యిందని, ఈ ఏడాది మరింత ఎక్కువ నమోదు చేసేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

జిల్లా ఎస్‌పి దీపిక మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల ప్రక్రియను శాంతియుతంగా, ప్రశాంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలను తీసుకున్నామని చెప్పారు. ఎన్నికల బందోబస్తుకు జిల్లా పోలీసులు, రాష్ట్ర పోలీసులతో కేంద్ర బలగాలను వినియోగిస్తున్నామని చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ప్రజల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపేందుకు ఇప్పటికే పోలీసు దళాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని, అవగాహనా సదస్సులను నిర్వహించామని తెలిపారు. ఎక్కడైనా ఏదైనా అనుకోని సంఘటన జరిగితే, కేవలం 5 నిమిషాల్లోనే అక్కడికి చేరుకొనే విధంగా ర్యాపిడ్ యాక్షన్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని లైసెన్సు తీసుకున్న తుపాకులను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నామని, పలువురిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. ఎన్నికల తనిఖీల్లో భాగంగా వివిధ చెక్ పోస్టులు, స్క్వాడ్ బందాల తనిఖీల్లో ఇప్పటివరకు సుమారు రూ.11.38 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, విలువైన లోహ పరికరాలు, వస్తువులను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌పి వివరించారు. విలేకర్ల సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారం

(మొదటిపేజీ తరువాయి)

కూడా దాడి చేసేందుకు యత్నించాయి. దీన్ని గమనించిన ప్రజలు వెంటనే వాటిని తరిమి వేశారు. ఇటీవలే కోన గ్రామానికి చెందిన అధికారి సింహాచలానికి చెందిన మూడు మేకలపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. కుక్కల సంతతి విపరీతంగా పెరిగిపోవడం, వీటిని ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి మక్కువతో పాటు గ్రామాల్లోని కుక్కల గుంపును ఏరివేయాలని ప్రజలు కోరుతున్నారు.

సిపిఎంతోనే గిరిజనులకు రక్షణ

(మొదటిపేజీ తరువాయి)

కాలరాసిందని అన్నారు. కావున గిరిజనులు హక్కులను కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఏజెన్సీలో గిరిజనులకు నూటికి నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జీవో 3ను రద్దుచేసి గిరిజనులను ఉద్యోగాలకు బిజెపి దూరం చేసిందని, అటువంటి బిజెపి ప్రభుత్వానికి రాష్ట్రంలో ఉన్న పార్టీలు పొత్తులు తొత్తులుగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఇటువంటి పార్టీలను సాగనింపి గిరిజనుల చట్ట సభల్లో వినిపిస్తేనే గిరిజనులకు న్యాయం జరుగుతుందని, కావున ఇండియా కూటమి బలపరిచిన సిపిఎం అభ్యర్థులకు మద్దతు ఇచ్చి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో సిపిఎం నాయకులు టివి రమణ, కోరాడ ఈశ్వరరావు, అంగధ, వాసు తదితరులు పాల్గొన్నారు.

కూనేరు సంతలో సిపిఎం ప్రచారం

కొమరాడ : ఎర్రజెండా తరపున పోటీ చేస్తున్న మండంగి రమణ, పాచిపెంట అప్పలనరసకు సుత్తీ, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని కూనేరు సంతలో సిపిఎం నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు పి.శ్రీనునాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వాకాడ ఇందిర, కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ ఈరోజు గిరిజన హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ప్రతిరోజూ పోరాడుతున్న సిపిఎం ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థులు మండంగి రమణ, పి.అప్పలనరసికు అత్యధిక ఓట్లేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు మిన్నారావు, కృష్ణ, సోములు, సిపిఎం నాయకులు రామారావు, శివున్నాయుడు, నాగభూషణ, మధు, కైలాస్, దాలయ్య, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని తుంబలి, తొంబలిగూడ, సిరికొండ, ఒబ్బంగి, దుంబెంగివలస, నేలిగండి, సులభంపాడు, ఈతమానుగూడ, పూతికవలస తదితర గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఇండియా కూటమి సిపిఎం బలపర్చిన అరకు పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంట అప్పలనరస అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, అలాగే కూటమి కాంగ్రెస్ అభ్యర్థి సవర చంటిబాబును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామాల్లో బైక్ ర్యాలీ చేసి ప్రచారం వినూత్నంగా నిర్వహించారు. గిరిజనులకు అండగా సిపిఎం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంగరాపు సింహాచలం, బాబూరావు, పి.వీరయ్య, పి.కుమార్, పత్తిక సలీం, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: ఇండియా వేదిక సిపిఎం ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సకు మద్దతుగా శనివారం ప్రజానాట్యమండలి కళాకారులు పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శివాజీ బొమ్మ జంక్షన్‌లో కళాకారులు పాటలు పాడి అలరించారు. అప్పలనర్సకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మోడీ ప్రభుత్వ విధానాలపై పాటలు పాడి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వైనాయుడు ఉన్నారు.

ప్రచారం.. పరిసమాప్తం

(మొదటిపేజీ తరువాయి)

ప్రవాహం రకరకాల దారుల్లో తరలిపోతోంది. ద్విచక్ర వాహనాలను తనిఖీ చేయకపోవడంతో వాటిలోనూ కొంతమొత్తం రవాణా అవుతున్నట్లు తెలుస్తోంది. ఆశ, దురాశ కొద్దీ డబ్బులు, మద్యం పంపకాలు చేస్తున్నప్పటికీ ఈ ప్రభావం ఓటింగ్‌పై పడే పరిస్థితి లేదని, ఒకప్పటితో పోలిస్తే ఓటర్లు చైతన్యవంతులేనని చాలా మందినోట వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో వలసకుటుంబాలు కూడా గ్రామాలకు చేరుకుంటున్నాయి. వారు స్వగ్రామాలకు వచ్చేందుకు అవసరమైన రవాణా ఛార్జీలను ఇప్పటికే ఆయా పార్టీలు ఫోన్‌పే ద్వారా పంపించాయి. ఓటు వేసేందుకు కూడా డబ్బులు ముట్టజెప్పారు. పోలింగ్‌కు ముందు రోజు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు సెలవుదినం కావడంతో చాలా మంది ముందు రోజు రాత్రికే గ్రామాలకు చేరుకునే విధంగా ప్రయాణ ఏర్పాట్లు చేసుకున్నారు. పోలింగ్ రోజు కూడా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సంస్థలకు సెలవు దినంగా ప్రకటించారు. ప్రైవేటు సంస్థలు శెలవు ఇవ్వకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామంటూ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎన్నికల అధికారులు (కలెక్టర్లు) ప్రకటించారు. ఈనేపథ్యంలో పోలింగ్ శాతం కూడా పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు, ఇటు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి

విధుల్లో అలసత్వం వద్దు : ఎస్‌పి

ప్రజాశక్తి-గజపతినగరం, బొబ్బిలి

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దని పోలీసు సిబ్బందికి ఎస్‌పి ఎం.దీపిక సూచించారు. గజపతినగరం, బొబ్బిలి నియోజకవరబొబ్బిలి అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఎటువంటి అలసత్వం వద్దని, పార్టీలకు అతీతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. 100 మీటర్ల పరిధిలో ఓటర్లు మినహా ఇంకెవ్వరూ ఉండకుండా చూడాలని, 200 మీటర్లు దూరంలోనే ఓటర్ల వాహనాలను నిలిపి వేయాలని, ప్రశాంతయుతంగా ఎన్నికల నిర్వహణకు పని చేయాలని సూచించారు. ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే సంబధిత అధికారులకు సమాచారం అందించాలని అధికారులు, సిబ్బందికి ఆదేశించారు. బొబ్బిలి డిఎస్‌పి పి.శ్రీనివాసరావు , పిటిసి డిఎస్‌పి వివి అప్పారావు, బొబ్బిలి సిఐ ఎం.నాగేశ్వరరావు, గజపతినగరం సిఐ ఎస్‌వి ప్రభాకరరావు, పలువురు ఎస్ఐలు, సిబంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఓటు వేసేందుకు వస్తూ...

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 13న జరగనున్న పోలింగ్‌లో ఓటు వేసేందుకు మండలంలోని లక్ష్మీపురానికి చెందిన గవర ముసలినాయుడు (24) సొంత గ్రామానికి వస్తుండగా వరంగల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.



మృతి చెందిన ముసలినాయుడు (ఫైల్)

తెలంగాణలోని బూపల్లి జిల్లాలోని రామగుండంలో ఓ కంపెనీలో సీతానగరం మండలం లక్ష్మీపురానికి చెందిన ముసలినాయుడు (సాయి) పనిచేస్తున్నాడు. సొంత గ్రామంలో ఓటేసేందుకు ఆయనతో పాటు స్నేహితులను డ్రాప్ చేయడానికి వరంగల్ బస్టాండ్‌కు ద్విచక్ర వాహనంపై వచ్చారు. బస్సు కోసం ఎదురుచూస్తున్న సమయంలో సాయితో పాటు స్నేహితులను ట్రిప్పర్ ఢీకొంది. దీంతో సాయి అక్కడికక్కడే మృతి చెందాడు. సాయి మృతితో తండ్రి గోపాలం, తల్లి కన్నతల్లి, చెల్లి రాధ కన్నీరుమున్నీరై రోధిస్తున్నారు. అందివచ్చిన కుమారుడు చనిపోవడంతో రోదిస్తున్నారు.

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బూర్జ గ్రామానికి చెందిన చందాన అప్పలనాయుడు కడుపునొప్పి భరించలేక గడ్డి మందు తాగి ఆత్మ హత్య చేసుకున్న సంఘటన శనివారం జరిగింది. పోలీసులు అందించిన వివరాల మేరకు అప్పలనాయుడు కడుపునొప్పి ఉందని మందులు వాడుతున్నప్పటికీ తగ్గకపోవడంతో గడ్డి మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు పార్వతీపురం ఆస్పత్రికి తరలించారు. వైద్యం అందిస్తూనే మరణించారు. ఆయన కుమారుడు తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇచ్చి హెడ్ కానిస్టేబుల్ సోమేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

250 మద్యం బాటిళ్లు స్వాధీనం

వంగర : మండలంలోని మద్దివలసలో ఓ క్రాఫ్ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 250 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రాజాం రూరల్ సిఐ ఎస్.శ్రీనివాస్ శనివారం తెలిపారు. మద్యం బాటిల్లను అక్రమంగా నిల్వ చేసిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు.



ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం-మన్యం
ఆదివారం
12 మే 2024

ఎర్రజెండా రెపరెపలు



సాలూరు పట్టణంలో సిపిఎం ఎంపి అభ్యర్థి అప్పలనర్సకు మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు, డప్పు కళాకారులు





వలసబల్లేరులో ప్రచారం చేస్తున్న సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ ; ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న వైసిపి బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకట చినప్పలనాయుడు



ఎన్నికల ప్రచారం చేస్తున్న టిడిపి బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన

రాష్ట్రాన్ని లూటీ చేసిన జగన్

టిడిపి శృంగవరపుకోట ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

సిఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని లూటీ చేశారని టిడిపి అభ్యర్థి కోళ్ల లలితకుమారి ఆరోపించారు. శృంగవరపుకోట, లక్కవరపుకోట మండలాల్లోని పెదఖండేపల్లి, వీరనారాయణం, కొత్తపాలెం, రెల్లిగైరమ్మపేట గ్రామాల్లో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం, ఇసుక కుంభకోణాలతో సిఎం జగన్ రాష్ట్రాన్ని దేశంలో అవినీతిలో ముందు వరసలో ఉంచారని మండిపడ్డారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టే బాధ్యత తనదని చెప్పారు. ఎన్నికల్లో టిడిపికి ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి సుధారాణి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వబ్బిన సత్యనారాయణ పాల్గొన్నారు.



కొత్తవలసలో ర్యాలీలో అభివాదం చేస్తున్న భరత్ సతీమణి తేజస్విని

భరత్ సతీమణి ప్రచారం

కొత్తవలస : సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిని గెలిపించి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఎంపి అభ్యర్థి శ్రీభరత్ సతీమణి తేజస్విని అన్నారు. శనివారం సాయంత్రం కొత్తవలసలో ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో తేజస్విని పాల్గొన్నారు. కొత్తవలస జంక్షన్లో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఆఖరి రోజు ప్రచార హోరు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎన్నికల ప్రచారాలతో పట్టణ, గ్రామీణ ప్రాంతాలు హోరెత్తాయి. ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం ఐదు గంటలతో ముగియడంతో వైసిపి, టిడిపి పోటాపోటీగా ప్రచారం చేశాయి. పట్టణంలోని పలు వార్డుల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయనకు మద్దతుగా ఆయన సోదరుడు రామ్‌నాయన, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, గ్రామాల్లో సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. వైసిపి అభ్యర్థి శంబంగి వెంకట చిన అప్పలనాయుడుకు మద్దతుగా పట్టణంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, మాజీ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, గ్రామాల్లో సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. టిడిపి అభ్యర్థి బేబినాయన, వైసిపి అభ్యర్థి శంబంగి వెంకట చిన అప్పలనాయుడు గ్రామాల్లో వేర్వేరుగా ఎన్నికల ప్రచారం చేసి మేనిఫెస్టోను వివరించి ఓట్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ అభ్యర్థి మరిపి విద్యాసాగర్ గ్రామాల్లో తమ మద్దతుదారులతో ప్రచారం చేశారు. ఎన్నికల ప్రచారానికి సమయం ముగియడంతో ప్రలోభాలకు ప్రయత్నం చేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

రామభద్రపురం : అభివృద్ధి, సంక్షేమమే కూటమి ధ్యేయమని టిడిపి విజయనగరం ఎంపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన తెలిపారు. మండలంలోని కొట్టక్కి గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొన్నారు. వైసిపి పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యుత్తు, ఆర్‌టిసి, బస్సుఛార్జీలు, నిత్యావసర ధరలు ఆకాశానికి అంటాయని చెప్పారు. దీంతో సామాన్యులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కూటమి అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, తెలుగు యువత మండల అధ్యక్షులు ముల్లు రాంబాబు, జనసేన నాయకులు గిరడ అప్పలస్వామి, నాయకులు బెవర సీతారాం, వంగపండు అప్పలనాయుడు, గొర్లె రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి

గ్రామాల్లో మాధవి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- నెల్లిమర్ల


జన విజయ యాత్రలో భాగంగా శనివారం ఎన్‌డిఎ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగ మాధవి మండలంలోని పెదతరిమి, కొత్తూరు, పల్లిపేట, జరజాపు పేట గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ రెడ్డి ప్రభుత్వంలో తారక రామతీర్థ సాగర ప్రాజెక్టు, తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు ఊసే లేదని నెల్లిమర్ల నియోజకవర్గ మొత్తం ఎడారిని తలపిస్తుందని, నవరత్నాలు నవ మోసాలుగా రూపాంతరం చెందాయని ధ్వజమెత్తారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనేది తీసుకొచ్చి తరతరాలుగా వారసత్వంగా వచ్చిన భూమికి కూడా ఈ జగన్ టైటిలింగ్ ఇవ్వకపోతే రైతులకు, భూహక్కుదారులకు ఆయా హక్కులు సంక్రమించే పరిస్థితి లేకుండా చేస్తున్నారన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా కబ్జాలపై దృష్టి పెట్టాడని ఆరోపించారు. తనకు ఒక సారి అవకాశమిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని వేలాది మంది యువతకు ఉద్యోగవకాశాలు కల్పిస్తామని చెప్పారు. తనకు గాజు గ్లాసుపైన, ఎమ్‌పి అభ్యర్థి అప్పలనాయుడకు సైకిల్ గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సువ్వాడ రవిశేఖర్, కడగల ఆనంద్ కుమార్, గేదెల రాజారావు, అవనాపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరో అవకాశం ఇవ్వండి

ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

అన్ని వర్గాల ప్రజల మద్దతుతో ఎమ్మెల్యేగా ఎన్నికై సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడానికి మరో అవకాశమివ్వాలని డిప్యూటీ స్పీకర్, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శనివారం పెద్ద మార్కెట్ ప్రాంతంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మార్కెట్లో ఉన్న వర్తకులు, పళ్ళు, కూరగాయల అమ్మకం దారులను కలుసుకొని తనకు మద్దతుగా ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ నగరంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టానని అన్నారు. పార్కులను సుందరీకరించామని, రహదారులు విస్తరించి సౌకర్యవంతంగా తీర్చిదిద్దామని, ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేశామని, నగర సుందరీకరణకు అధిక ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. మరోసారి ఎమ్మెల్యేగా అవకాశాన్నిస్తే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. చేసేది ఏమీలేక, చెప్పేది చేయలేక టిడిపి నాయకులు తనపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుజ్జుల నారాయణరావు, ఎంకెబి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పెద్ద మార్కెట్లో ప్రచారం చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ఒక్క అవకాశమివ్వండి

టిడిపి విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థి అదితి

ప్రజాశక్తి- విజయనగరం కోట


ఈ సారి తనకు ఒక అవకాశమివ్వాలని టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పూసపాటి అదితి గజపతిరాజు కోరారు. శనివారం పట్టణంలోని 45వ డివిజన్ కామాక్షినగర్, కృష్ణుడి కోవెల ఏరియా, కె.ఎల్.పురం, రామాలయం వీధి, రాజులకొలనీ ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు, హామీల పట్ల ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని, ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రాన్ని కాపాడగలిగే నాయకుడు చంద్రబాబు నాయుడు అని ప్రజలు నమ్ముతున్నారని చెప్పారు. విజయనగరం ప్రజల కోసం ముషిడిపల్లి మంచి నీటి పథకం, నాగావళి చంపావతి నదుల అనుసంధానం ద్వారా విజయనగరం ప్రజల దాహార్తిని తీర్చిన ఘనత టిడిపిదేనన్నారు. నగరంలో ప్రజలు మంచి నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని తనను గెలిపిస్తే సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. గడిగెడ్డ రిజర్వాయరు పనులు టిడిపి ప్రభుత్వంలో ప్రారంభిస్తే వైసిపి వచ్చాక ఆ పనులను గాలికి వదిలేశారన్నారు. ఇటువంటి ప్రజా ఉపయోగ పనుల గురించి ముఖ్యమంత్రికి వివరించే ధైర్యం స్థానిక ఎమ్మెల్యేకి లేదన్నారు. ఎప్పుడు ఆయన తన స్వంత వ్యాపారాలు, స్వలాభం కోసమే ఆలోచిస్తారని, బలవంతపు వసూళ్లు చేయడం, వ్యాపారం చేసేవారి నుంచి వాటాలు తీసుకోవడం వంటివి చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు ప్రజల ఆస్తులను దోచుకోవడానికి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చారని చెప్పారు.



45వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న టిడిపి విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థి అదితి గజతిరాజు

ఆమెకు మద్దతుగా చెల్లి పూసపాటి విద్యావతి దేవి 25వ డివిజన్ రంగాల వీధి, కర్రల మార్కెట్, కోళ్ల బజార్, డాబాతోట ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కార్యాలయ కార్యదర్శి రాజేష్‌బాబు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారుబాబు, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాసరావు, అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్, గాడు అప్పారావు, కొండ్రు శ్రీనివాసరావు, పైడిరాజు, బిజెపి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టం ఎవరికో?



- ఒక వైపు ప్రలోభాలు.. మరోవైపు ప్రగతి
- మీ ఓటే మీ వాణి.. అది ప్రభావం చూపాలి
- ఆలోచించి అడుగు వేస్తే భవిత బంగారం

మంచినీరు లభించని చోట మద్యం ఏరులై పారుతోంది. అంటే? మనం ఏ సమాజంలో ఉన్నట్లో ఆలోచించాలి. బతకాలంటే తాగునీరు కావాలి. పది మందిని బతికించాలంటే పంటకు నీరు కావాలి. మద్యం నీళ్లు కొంతసేపు మత్తునిస్తాయి. అదే రక్షిత జలం మనల్ని ఆరోగ్యంగా నడిపిస్తుంది. పైరుకు కొత్త ఊపిరిలొదిలేలా చేస్తుంది. మంచి నాయకుడు సమాజానికి మేలు చేస్తాడు. అవినీతి పరుడైన నాయకుడిని ఎన్నుకుంటే సమాజాన్ని కలుషితం చేస్తాడు.

ఐదేళ్లకు ఒకసారి జరిగే ఎన్నికలు 50 ఏళ్ల భవిష్యత్తును నిర్దేశిస్తాయి. పోలింగ్ రోజు కేవలం ఐదు నిమిషాలు ఆలోచించి ఓటేస్తే ఆ ఓటుతో 1825 రోజుల పాటు ప్రత్యక్ష సేవ పొందే అవకాశం ఉంటుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మొదట్లో జరిగిన ఎన్నికల్లో ప్రజలతో సత్సంబంధాలు.. పేదల పక్షాన పోరాటం... నిరాడంబరత.. సామాజిక సేవా దృక్పథం. దేశభక్తి అభ్యర్థులకు ప్రధాన అర్హతలుగా ఉండేవి. పోటీలో ఉన్న మంచివారిలో ఒకరిని ఎంపిక చేసుకునేవారు. నేడు కాలం మారింది. రాజకీయ వారసులొచ్చారు. తమ ఆస్తులను కాపాడుకోవడం కోసం, కొత్తగా సంపాదించేందుకు రాజకీయాల్లోకి వస్తున్నారు. ప్రజా సేవ ముసుగులో రాజకీయ వ్యాపారం చేస్తున్నారు.


రాష్ట్రంలో 175 నియోజకవర్గాలు ఉంటే, దాదాపు 112 చోట్లా ఓటర్లపై నగదు ప్రలోభాలు ఉంటాయని రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తించింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 3 పార్లమెంట్ స్థానాల పరిధిలో 11 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండటంతో ఈ పరిస్థితి ఇక్కడా ఎక్కువే ఉండనున్నాయి. పోలింగ్ రోజున తమ పార్టీ అభ్యర్థికే ఓటు వేయాలంటూ రూ.వెయ్యితో ప్రలోభాలకు గురిచేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. అభ్యర్థుల ఖర్చు కొన్ని నియోజక వర్గాల్లో రూ.20 నుంచి రూ.40 కోట్లకు చేరవచ్చని అంచనా. అరాచకాలు, అవినీతికి పాల్పడి సంపాదించే మొత్తంతో ఓట్లు కొనే నాయకులు గెలిచాక ప్రజాసేవ ఎంతవరకు చేస్తారో ఓటర్లు ఆలోచించుకోవాలి.

నోట్ల కట్టలు కుమ్మరించి



ఓటర్లు అందరూ ఒక్కటే కాదు.. కులాలు, మతాలు, తరగతుల వారీగా అభ్యర్థులు వారిని చూస్తున్నారు. ఆయా తరగతుల ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు కానుకలు ఇస్తున్నారు. చీర, చాక్లెట్, ఎలక్ట్రానిక్ పరికరాలు, క్రికెట్, వాలీబాల్ కిట్లు అందిస్తున్నారు. ఒక్కో నియోజకవర్గంలో కానుకలకు సగటున రూ.కోటి నుంచి రూ.3 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఓటరుకు విలువైన వస్తువులు అందించేందుకు కొన్ని చోట్ల టోకెన్లు అందిస్తున్నారు.

సంపదపైనే దృష్టి



ఓటుకు నోట్ల కట్టలు కుమ్మరించి ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టరు. వారికి సంపాదనపైనే దృష్టంతా ఉంటుంది. దీంతో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు అపరిష్కృతంగా ఉండడంతో పాటు కొత్త ఇబ్బందులు పుట్టుకొస్తాయి. ఇష్టానుసారంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలపై నియంత్రణ లేదు. విద్య, వైద్యం ప్రయివేటు పరం చేశారు. ఇప్పటికే చెత్తపై పన్ను వేశారు. రేపు తాగునీటికీ మీటర్లు పెట్టి, నీటిని లీటర్లలో కొనుక్కునే పరిస్థితిని తేనున్నారు. పేదలు ఇంకా పేదలుగానే మిగులుతున్నారు.. సంపన్నులు అక్రమ మార్గాల్లో మరింత ధనవంతులు అవుతున్నారు.

నాయకులు ఎలా ఉన్నారు



ప్రజాప్రతినిధికి దార్శనికత ఉండాలి. నేటితరమే కాదు.. రేపటి తరానికి మేలు చేసేందుకు ఏం చేయాలనే అవగాహన ఉండాలి. అదిలేని చోట అన్నీ ఇబ్బందులే ఉంటాయి. విజన్ లేని వారు ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనా అభివృద్ధిలో భాగస్వాములు కాలేరు. ఇసుక, మద్యం, భూ దందాలతో ఉన్న ఆస్తులను రెట్టింపు చేసుకుంటారు తప్ప, ప్రజలకు చేసేదేమీ ఉండదు. అటువంటి వారికి ఓటు వేస్తే మరింత నష్టపోతాం. అడ్డదారుల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు రౌడీ రాజ్యాన్ని ప్రోత్సహిస్తారు. ఆర్థికంగా ఉన్న కుటుంబాల నుంచి వచ్చేవారు ఉన్న ఆస్తులను కాపాడుకోవడం, వీలైతే ఆస్తులను రెట్టింపు చేసుకోవడం కోసమే చూస్తున్నారు. ప్రజల సమస్యలపై కనీసం స్పందించుకోవడం లేదు.

ప్రశ్నించే హక్కు


ఓటుకు నోటు తీసుకుంటే ప్రశ్నించేతత్వం కోల్పోతాం. రేపు మీ వీధిలో, మీ ప్రాంతానికి సంబంధించిన సమస్యలపై నేతలను ప్రశ్నించాలంటే వెనుకాడాల్సి వస్తుంది. ఒక వేళ ప్రశ్నించినా 'మీరు డబ్బులు తీసుకుని ఓటు వేశారు.. నేను ఉచితంగా సర్వీసు చేయాలా?' అని నేతలు ప్రశ్నించక మానరు. అందుకే అవినీతి రహిత సమాజ నిర్మాణానికి మనం తోడ్పాటు కావాలంటే.. ముందు ఆ మార్పును మన నుంచే మొదలుకావాలి.

కదిలించే నాయకుడు కావాలి



ఏ సమస్య ఉన్నా నేనున్నానంటూ అండగా ఉండే నాయకుడెవరో గుర్తించాలి. అలాంటి నాయకుడిని ఎన్నుకుంటే ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు. టీవీల్లో, బహిరంగ సభల్లో కాదు.. కనీసం రోజు మారి రోజు ప్రజలకు కనిపించే ప్రజాప్రతినిధులు కావాలి. మద్యం, డబ్బు, కులం, మతం.. ఇవి ప్రామాణికంగా తీసుకుని గెలిచే వారికి దార్శనికత ఉండదు. అదే దార్శనికత ఉన్న ప్రజాప్రతినిధి అయితే దానికి తగ్గట్టుగానే అభివృద్ధి జరుగుతుంది. ఐదు, పదేళ్లకు ఏం చేయగలమో దానిపై ప్రజాప్రతినిధికి స్పష్టమైన అవగాహన ఉండాలి. అది లేకుండా రాబిన్‌హుడ్ పాత్ర తరహాలో దోచుకున్న దాంట్లో కొంత అభాగ్యులకు పంచి, తాను మంచివాడినని ప్రచారం చేసుకునేవారు పెరుగుతారు. వ్యవస్థల్ని నాశనం చేసేవారు కాకుండా, వాటిని దార్శనికతతో నిలబెట్టే అభ్యర్థులు సమాజానికి కావాలి.

మన వాణి వినిపించేవారు కావాలి



అసెంబ్లీ, పార్లమెంట్‌లో ప్రజా సమస్యలను వినిపించే నాయకులు కావాలి. పేదరికం, నిరుద్యోగం, అన్నదాతల ఆత్మహత్యలు, ఆకలి చావులు దేశం, రాష్ట్రంలో మరింత పెరిగిపోయాయి. వీటిపై మాట్లాడే నాయకులు కావాలి. వాటిని నివారించే ప్రభుత్వాలు ఏర్పాటు కావాలి. మంచికి, చెడుకు జరుగుతున్న యుద్ధంలో మనం ఎటువైపు ఓటు వేసి నిలబడుతున్నామో చూసుకోవాలి. అవినీతిపరులకు పదవులు కట్టబెడితే వారు మరింత ధనవంతులు కావడం తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదు. అదే ఓ మంచి నాయకుడిని ఎన్నుకుని పంపిస్తే.. రేపటి భవితకు చక్కని దారినిచ్చిన వారిమి అవుతాం. అప్పుడే మనం కలలు కన్న సమాజం ఆవిష్కృతం అవుతుంది. ప్రస్తుతం ఉన్న పార్టీల్లో ఏది మంచిదో ఓటరు గుర్తించి, వారికి ఓటు వేయడం ఉత్తమం. ఆ దిశగా ఓటర్లు చైతన్యవంతమైననాడే మంచి సమాజం ఏర్పాటుకు దోహదపడిన వారవుతాం.



కోటలో సోదాలు చేస్తున్న పోలీసులు

కోటలో పోలీసు సోదాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

కోటలో పోలీసులు సోదాలు చేశారు. కోటలో డబ్బులు, మద్యం దాచినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు, ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ తమ సిబ్బందితో కలిసి సోదాలు చేశారు. సోదాలలో ఎటువంటి మద్యం, డబ్బులు దొరకపోవడంతో పోలీసులు వెనుదిరిగారు.



మాట్లాడుతున్న ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

ఎన్నికల హామీలను అమలు చేసిన ఘనత మాదే

ఎంపి బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత తమదేనని వైసిపి ఎంపి అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని శనివారం దాడితల్లి ఆలయం నుంచి ఎన్టీఆర్ బొమ్మ వరకు ర్యాలీ చేసి బహిరంగసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాదయాత్ర, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను సిఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేశారన్నారు. ఐదేళ్ల కాలంలో తమ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందన్నారు. ఎన్నికల్లో ప్రజలను మోసం చేసేందుకు టిడిపి బూటకపు హామీలను అమలు చేస్తోందన్నారు. చంద్రబాబు నాయుడు బూటకపు హామీలను నమ్మకుండా వైసిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సభ వద్ద వాగ్వివాదం

ఎన్‌టిఆర్ బొమ్మ వద్ద సాయంత్రం 5.30గంటల తర్వాత వైసిపి సభ నిర్వహించడంతో టిడిపి కార్యకర్తలు అభ్యంతరం చెప్పారు. సాయంత్రం 5గంటలకు ప్రచారం నిలిపివేయాలని ఆదేశించిన పోలీసులు వైసిపికి ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. పోలీసులు జోక్యంతో వాగ్వివాదం సద్దుమణిగింది.

తోటపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లిలో గల వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ ఆరాధన మంగళ శాసనాలు, విశేష హెూమాలు తదితర పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు వి వి అప్పరాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే తోటపల్లికి చెందిన ఓలేటి గౌరునాయుడు కుమారుడు గగన్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. ప్రస్తుతం ఎండలు తీవ్రత దృష్ట్యా మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది గంట శ్రీధర్ నాయుడు, మార్కొండ మురళి నాయుడు, పెడారపు పోలిరాజు, ఓలేటి గంగునాయుడు, మార్కొండ సీతంనాయుడు, గౌరునాయుడు, పకీరు నాయుడు, తామాడ దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్విన్ పేటలో టిడిపి అభ్యర్థి ప్రచారం

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఎల్విన్ పేట గ్రామంలో కురుపాం నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.



ప్రచారంలో పాల్గొన్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి విజయ్ చంద్ర, తదితరులు



పార్వతీపురంంలో ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

పోటాపోటీ ప్రచారం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సాధారణ ఎన్నికలకు ప్రచారం గడువు ముగుస్తున్న సందర్భంగా శనివారం వైసిపి, టిడిపి పార్వతీపురం పట్టణంలో భారీగా ర్యాలీలు నిర్వహించారు. ముందుగా వైసిపి తమ మద్దతుదారులతో స్థానిక పాతబస్టాండ్ నుండి బెలగాం వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించగా, రెండు గంటల వ్యవధిలో టిడిపి అభ్యర్థి బోనెల విజయ్‌చంద్ర తమ మద్దతుదారులతో కలిసి పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. దీనికి ముందుగా వైసిపి అభ్యర్థి ఎమ్మెల్యే అలజంగి జోగారావు మండలంలోని కోరి, కవిటిభద్ర, హిందూపురం, దిబ్బగుడ్డివలస, పెదబొండపల్లిలో ప్రచారం నిర్వహించారు. అలాగే టిడిపి అభ్యర్థి బోనెల విజయ్ చంద్ర పట్టణంలోని ఆరో వార్డులో పర్యటించి స్థానిక కౌన్సిలర్లు కండువా కప్పి తమ పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు కోఆప్షన్ సభ్యుడు గుంట క్రాంతికుమార్ కూడా పార్టీలో చేరారు. గడువు ముగియనుండడంతో ఇరువురు అభ్యర్థులు ప్రచారాలను నిలిపివేసి ఎన్నికల నిర్వహణపై దృష్టిని సారిస్తున్నారు. బూత్ ఏజెంట్ల నియామకం, ఓటర్ల జాబితాను పంపిణీ గ్రామాల్లో రహస్య సమావేశాలకు తెరతీస్తున్నారు.



మహిళతో మాట్లాడుతున్న డిఎంఒ జగన్మోహన్‌రావు

జ్వర లక్షణాలున్న వారిని గుర్తించాలి

ప్రజాశక్తి - కొమరాడ

గ్రామాల్లో ఫీవర్ సర్వే చేపట్టి జ్వర లక్షణాలున్న వారిని గుర్తించాలని జిల్లా మలేరియా అధికారి(డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు స్పష్టం చేశారు. సివినిలో శనివారం సందర్శించిన ఆయన వైద్య సిబ్బంది అక్కడ చేపడుతున్న ఆరోగ్య పరీక్షలను పరిశీలించారు. ఫీవర్ సర్వలెన్స్, డ్రైడే కార్యక్రమాల నిర్వహణ, వాటి నమోదు వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. సర్వేలో సేకరించిన రక్త పూతల స్లైడ్స్‌ను ల్యాబ్‌లో త్వరగా పరీక్షలు జరిపి నివేదికలు తెలపాలన్నారు. అలాగే సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలను పరిశీలించారు. గ్రామంలో ఫ్రైడే డ్రైడే ఏ మేరకు నిర్వహిస్తున్నారో గమనించారు. దోమల లార్వా గుర్తించడంలో దృష్టి సారించాలన్నారు. గర్భిణీ గృహ సందర్శన చేసి ఆరోగ్య పరిశీలన చేశారు. డీహైడ్రేషన్ చెందకుండా జాగ్రత్తలు సూచించారు. అవసరమైన మందులు, నిర్ధారణ పరీక్షలు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు గ్రామంలో అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ విజయకుమారి, వైద్య సిబ్బంది ప్రమీల, లత, రామకృష్ణ, రమేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సిద్ధంగా ఉన్న కౌంటర్లు

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - కురుపాం

ఎన్నికల నిర్వహా ణకు సంబంధించి అవస రమైన అన్ని ఏర్పాట్లు చేశామని కురుపాం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వి.వెంకట రమణ తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన మాట్లా డుతూ నియోజక వర్గంలోని ఐదు మండలాల్లో 268 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఒక్కో కేంద్రానికి ఆరుగురు సిబ్బందిని ఎన్నికలు నిర్వహించేందుకు నియమించామన్నారు. 1608 మంది సిబ్బంది విధులు నిర్వహించ నున్నారని, మరో 300 మంది రిజర్వులో ఉంటారని, పోలింగ్ నిర్వహణ సామగ్రి పంపిణీ కోసం 16 డిస్ట్రిబ్యూషన్ కౌంటర్లు, 16 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ సామగ్రి , సిబ్బంది తరలింపు కోసం వాహనాలు, రూట్ ఆఫీసర్లు, రక్షణ బలగాలు సిద్ధం చేశామని తెలిపారు. సిబ్బందికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

పుచ్చకాయలు, తాటిముంజులతో పోషకాలు మెండు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు ఉపశమనం కోసం పుచ్చకాయలు, తాటిముంజులు, శీతల పానీయాల కోసం పరుగులు పెడుతున్నారు. దీంతో వాటి ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. ప్రకృతి వరప్రసాదం తాటి ముంజులతో అనేక ప్రయోజనాలు, ఎనలేని పోషకాలు ఉన్నాయి. పిల్లలు, పెద్దలు వయసుతో సంబంధం లేకుండా అందరూ అమితంగా వీటిని ఇష్టపడతారు. శరీరంలో చక్కెర ఖనిజ ప్రమాణాలను సమతుల్యం చేస్తాయి. విటమిన్ బి7, విటమిన్ కె, సోలెబుల్ ఫైబర్, పొటాషియం కాలుష్యం విటమిన్ ఏ విటమిన్ సి, విటమిన్-డి, జింక్ ఐరన్ లతో పాటు న్యూట్రిషన్స్ ఉంటాయి. నీటి శాతం ఎక్కువ ఉండటంవల్ల వేసవిలో వేడి దెబ్బ తగలకుండా చేస్తాయి. ఇవి శరీర ఉష్ణోగ్రతను తగ్గించి శరీరాన్ని చల్లబరుస్తాయి వీటిలో ఉండే అధిక నీటి శాతం శరీరం డిహైడ్రేషన్ బారిన పడకుండా చేసి శరీరానికి చలువను అందిస్తాయి. వీటిలో పొటాషియం సమద్ధిగా ఉండడం వలన రక్తపోటు అదుపులో ఉండి గుండె ఆరోగ్యానికి సహాయపడతాయి అంతేకాకుండా శరీరంలోని హానికర వ్యర్థ పదార్థాలను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. వేసవిలో తాటి ముంజులను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా లివర్ సంబంధిత సమస్యలను తగ్గించుకోవచ్చు. వీటిలో ఉండే పోషకాలు జీర్ణ సంబంధిత సమస్యను తగ్గిస్తాయి.

ఈనేపథ్యంలోనే తాటి ముంజులుకు గిరా కీ పెరి గి పోయింది. గత ఏడాది డజన్ ముంజులు ధర రూ.30 ఉంటే ఈ ఏడాది రూ.50 నుంచి రూ.60వరకు పెరిగి పోయింది.



తాటికాయలు అమ్మకం చేస్తున్న కార్మికుడు

పుచ్చకాయలతో ప్రయోజనాలెన్నో...

వేసవి తాపాన్ని దాహాన్ని తీర్చేందుకు అద్భుతమైన ఫలం పుచ్చకాయ. శరీరంలో వేడిని తగ్గించి చలువ చేస్తుంది. ముఖ్యంగా ఎండల తీవ్రతతో శరీరంలో వాటర్ లెవెల్స్ మాటిమాటికి తగ్గిపోతూ ఉంటాయి. ఇలాంటప్పుడు వడదెబ్బ తగిలి కళ్ళు తిరిగి కింది పడి పోతుంటారు. చాలామందికి ఒక్కోసారి ప్రాణాపాయం సంభవి స్తుంటుంది. అందుకే శరీరంలో వాటర్ లెవెల్స్, షుగర్ లెవెల్స్ తగ్గిపోకుండా చూసుకోవాలి. పుచ్చకాయ తినడం వల్ల వివిధ రకాల పోషకాలతోపాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఎండాకాలంలో మన శరీరానికి కావలసిన పోషకాన్ని అందిస్తాయని డాక్టర్లు చెబుతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు

ప్రజాశక్తి
ఆదివారం 12 మే 2024

ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో ఎన్నికల విధులకు హాజరు అవుతున్న సిబ్బందికి మూడో ర్యాండమైజేషన్ పూర్తి చేశామని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. పార్లమెంటరీ నియోజకవర్గ సాధారణ పరిశీలకులుగా ప్రమోద్ కుమార్ మెహర్డ సమక్షంలో శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ ప్రక్రియ అనంతరం సంబంధిత రిటర్నింగ్ అధికారులకు సీల్డు కవర్‌లో పంపించడం జరుగుతుందని చెప్పారు. ఈనెల 12న ఉదయం కవర్లను విప్పడం జరుగుతుందని, తద్వారా సిబ్బందికి ఏ పోలింగ్ కేంద్రానికి నియమించింది తెలుస్తుందని చెప్పారు. మైక్రో అబ్జర్వర్‌ల రెండవ ర్యాండమైజేషన్‌ను, ఇవిఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ కూడా పూర్తి చేశామని ఆయన అన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ జి.కేశవ నాయుడు, కంట్రోల్ రూం ఇన్ ఛార్జ్ అధికారి, ఎస్‌డిసి ఆర్‌వి సూర్యనారాయణ, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రిసెప్షన్ కేంద్రం ఏర్పాట్లు పరిశీలన

సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల సామాగ్రి స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పరిశీలించారు. ఉద్యాన కళాశాలలో ఎన్నికల సామాగ్రి స్వీకరణకు సంబంధించి ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సామాగ్రి స్వీకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల వారీగా వేసిన శిబిరాల్లోని కౌంటర్లు వద్ద టేబుళ్లు, కుర్చీల ఏర్పాటును పరిశీలించి పలు సూచనలను చేశారు. పోలింగ్ కేంద్రాల సామాగ్రి స్వీకరణ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇవిఎంల భద్రతా, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు, పనితీరును అందుబాటులో ఉంచిన జనరేటర్ల వివరాలను విద్యుత్ శాఖ ఇఇ పి.త్రినాథరావును అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా మాక్ డ్రిల్ నిర్వహించాలని అగ్నిమాపక అధికారి కె.శ్రీనుబాబును ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ ల వద్దకు సులువుగా చేరుకొని రాక పోకలకు అంతరాయం కలగకుండా రోడ్డు పనులను చేపట్టాలని పంచాయితీ ఇంజనీరింగ్ అధికారులను సూచించారు. అనంతరం కళాశాల ముందు భాగంలో బస్‌ల పార్కింగ్ స్థలాన్ని గుర్తించి అదే స్థలంలో బస్‌లను నిలపాలని అన్నారు. ఆయా అధికారులకు అప్పజెప్పిన పనులను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కంట్రోల్ రూమ్ ఎస్‌డిసి ఆర్.సూర్య నారాయణ, డ్వామా పిడి కె.రామచంద్రరావు, డిఆర్‌డిఎ పిడి వై.సత్యంనాయుడు, ఆర్‌ఎస్ డబ్ల్యు ఇంజనీరింగ్ అధికారి ఒ.ప్రభాకర్‌రావు, డిపిహెచ్‌ఇఒ కెజిఎన్ నరసింగ రావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, రోడ్లు, భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారి ఎస్.వేణుగోపాలరావు, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



రిసెప్షన్ కేంద్రం ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఉదయం 4 గంటల నుంచే ఎన్నికల సిబ్బందికి బస్సులు

జిల్లాలో ఎన్నికల విధులకు హాజరవుతున్న సిబ్బందికి ఆదివారం ఉదయం 4 గంటల నుండి బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కురుపాం, సాలూరు, పాలకొండ నియోజక వర్గ కేంద్రాలకు చేరుకొనేందుకు బస్సులను ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్నికల సిబ్బంది తమ ఎన్నికల ఉత్తర్వులు చూపించి ఉచితంగా బస్సుల్లో ప్రయాణించవచ్చని ఆయన తెలిపారు.



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎఎస్‌పి నరేష్‌బాబు

350 మంది పోలీసులతో బందోబస్తు

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గ పరిధిలో సాలూరు టౌన్, మండలం, పాచిపెంట, మక్కువ మండలాల్లో సాధారణ, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 350 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. అదనపు ఎస్పీ నరేష్ బాబు, డిఎస్పీ మురళీధర్ ఆధ్వర్యాన ఏడుగురు సిఐలు, 10 మంది ఎస్‌ఐలతో కలిపి 12 సిఎపిఎఫ్ సెక్షన్లు, 11 క్యుఆర్టీ టీంలతో కలిపి 350 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. టౌన్ సిఐ వాసునాయుడు, రూరల్ సిఐ బాలకృష్ణతో కలిపి ఏడుగురు సిఐలు, 10 మంది ఎస్‌ఐలు బందోబస్తు ఏర్పాట్లలో ఉంటారు. 14 పోలింగ్ ప్రాంతాలను సమస్యాత్మక, 10 పోలింగ్ ప్రాంతాలను తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. అన్ని గ్రామాల్లోనూ 144 సెక్షన్ విధించినట్లు డిఎస్పీ మురళీధర్ చెప్పారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వహించాలని సూచించారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్‌ఒ విష్ణుచరణ్

పోలింగ్ నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సాలూరు

ఈనెల 13న సాధారణ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని ఆర్వో విష్ణు చరణ్ కోరారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడడంలో సెక్టార్ అధికారులదే కీలక పాత్ర అని చెప్పారు. అనంతరం ఇవిఎం పంపిణీకి ఏర్పాట్లను పరిశీలించారు. పంపిణీ సందర్భంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆర్వో విష్ణు చరణ్ సూచించారు.



మక్కువ ప్రధాన రహదారిలో నిర్వహించిన భారీ ర్యాలీ

ఎప్పటిలాగే ఆదరించండి : రాజన్నదొర

ప్రజాశక్తి - మక్కువ

నాలుగు దఫాలుగా నన్ను ఎమ్మెల్యేగా ఎన్నుకుంటూ వస్తున్న నా మండల ప్రజలంతా ఈసారి కూడా వెన్నుదన్నుగా నిలిచి అత్యధిక మెజార్టీ తీసుకురావాలని ఎమ్మెల్యే పీడిక రాజన్న దొర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైసిపి మండల నాయకులు మావుడి రంగునాయుడు జడ్పిటిసి సభ్యులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మక్కువలో శనివారం ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల ప్రచారానికి చివరి రోజు కావడంతో రాజన్నదొర మండలంలో ఏర్పాటు చేసిన ఈ ర్యాలీకి అధిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా మజ్జి గౌరమ్మ గుడి నుండి ప్రారంభమైన ప్రచార ర్యాలీ ప్రధాని రహదారి గుండా మార్కెట్ వీధి నుండి అన్ని వీధుల్లో కొనసాగింది. అనంతరం రాజన్నదొర మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజారంజకంగా వైసిపి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందిందన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు మాత్రం జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సిఎంగా చూడాలనుకుంటున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపి అభ్యర్థి తనుజరాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మూలకు చేరిన వీల్ చైర్లు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీల్ చైర్లు మూలకు చేరాయి. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా దివ్యాంగులను పోలింగ్ కేంద్రానికి తరలించేందుకు వీలుగా అప్పట్లు వీల్ చైర్లను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. ఎన్నికల అనంతరం మండల పరిషత్ పాత కార్యాలయంలో వీటిని ఒక చోట పడవేయడంతో కొన్ని చైర్లు తుప్పు పట్టి దర్శనమిస్తున్నాయి.



నిరుపయోగంగా మూలకు చేరిన వీల్‌చైర్లు

కొటియా గ్రామాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఎన్నికలకు సంబంధించి విస్తృత పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని మన్యం జిల్లా అధికారులు ఎక్కువ సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించాలని కోరారు. ప్రత్యేక కేంద్ర పోలీస్ బలగాలను కొటియా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. 1965 నుంచి ఒడిశా, ఎపి మధ్య కొటియా గ్రామాల వివాదం నడుస్తోందన్నారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో కొటియా గ్రామాల ఓటర్లను పోలింగ్‌కు రాకుండా ఒడిశా అధికారులు పోలీసులు అడ్డుకున్నారని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను కూడా ఆ గ్రామాల్లో పర్యటించడానికి వెళ్లినప్పుడు ఒడిశా పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి అడ్డుకుంటున్నారని చెప్పారు. ఇప్పటికే తాను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, జిల్లా ఎన్నికల అధికారి, నియోజకవర్గ ఆర్వోలకు దీనిపై లేఖలు రాశానని చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా పరిగణించి అధిక సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించాలని రాజన్నదొర కోరారు.

అవాంఛనీయ సంఘటనల్లేకుండా చర్యలు : సిఐ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎల్విన్‌పేట సర్కిల్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని సిఐ పి.సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమస్యాత్మక, అతిసమస్యాత్మక పోలింగ్ బూత్‌ల వద్ద గట్టి నిఘాను ఉంచామని, అదనపు బలగాలను కూడా వాడుతున్నామని అన్నారు. అలాగే ఆయా ప్రాంతాల వద్ద పెట్రోలింగ్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సహకరించాలని సిఐ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

ప్రచారం చివరి రోజులు అభ్యర్థులేరి?

ప్రజాశక్తి - పాలకొండ

కొద్దిరోజులుగా హెూరెత్తి ప్రచారం చేసిన అభ్యర్థులు ప్రచారం చివరి రోజైన శనివారం ఎక్కడా కనబడలేదు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో కూడా వారు ఎక్కడా ప్రచారంలో పాల్గొన్న దాఖలాల్లేవు. ముఖ్యంగా జనసేన అభ్యర్థి జయకృష్ణ, వైసిపి అభ్యర్థి కళావతి కొద్దిరోజులుగా ఎండలను కూడా లెక్క చేయకుండా, ఓటర్ల దగ్గరకు వెళ్లి ఇంటిఇంటా ప్రచారం చేశారు. అయితే చివరిరోజు ప్రచారంలో హాజరు కాకపోవడం వారు ఎక్కడున్నారు అనేది ప్రజల్లో చర్చించుకుంటున్నారు. ఎన్నికలు దగ్గరపడడంతో ఎత్తుగడలతో రాజకీయ పావులు కదుపుతూ బిజీగా ఉన్నారా లేక గ్రామాల్లో ఉన్న ముఖ్య నాయకులతో చర్చలు జరుపుతున్నారా అనేది ప్రజల్లో చర్చ జరిగింది.

నిబంధనలకు విరుద్ధంగా బోరు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని బోటు వీధి కూడలి వద్ద ఒక వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు నిబంధనలకు వ్యతిరేకంగా బోరు తీయించడంతో బోరు నుండి వచ్చే మట్టి బురద రహదారిపైనే నిలిచిపోయింది. దీంతో పనుల నిమిత్తం మార్కెట్‌కు వెళ్లే పలువురు పాదాచారులు, ద్విచక్ర వాహనచోదకులకు ఆ రహదారిపై ప్రయాణించే అవకాశం లేక వేరే వీధి నుండి వెళ్లేందుకు నానా అవస్థలు పడ్డారు. ఇదే రహదారిపై వెళ్లే మరికొందరు ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడ్డారు. మున్సిపల్ ప్రజారోగ్యం శాఖ అధికారులు, సిబ్బంది ఈ పరిస్థితి పై దృష్టి పెట్టి సంబంధిత భవన యజమానిచే రహదారిపై ఉన్న బురదను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న బురదనీరు



మోడల్ పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి దీపికా పాటిల్

జిల్లాలో 10 మోడల్ పోలింగ్ స్టేషన్లు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 10 మోడల్ పోలింగ్ స్టేషన్లను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ నూతన విధానాలతో ఎన్నికలను నిర్వహించడానికి కృషి చేస్తోంది. అందులో భాగంగా ఈ ఎన్నికల్లో మోడల్ పోలింగ్ స్టేషన్స్ విధానాన్ని తీసుకువచ్చింది. మోడల్ పోలింగ్ స్టేషన్లలో ఓటింగ్ త్వరతగతిన జరిగేలా ఖచ్చితమైన విధానాన్ని అమలు చేయడానికి ఈ మోడల్ పోలింగ్ స్టేషన్‌లు తీసుకువచ్చారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 10 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. నెల్లిమర్ల నియోజకవర్గ పరిధిలో మూడు మోడల్ పోలింగ్ స్టేషన్లు, విజయనగరం నియోజకవర్గ పరిధిలో రెండు మోడల్ పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. మిగతా ఐదు నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి ఏర్పాటు చేశారు. యూత్ మేనేజ్‌డ్ పోలింగ్ స్టేషన్ల కింద నెల్లిమర్ల నియోజకవర్గంలోని పూసపాటిరేగ మండలం కొత్త కొప్పెర్ల పోలింగ్ స్టేషన్ నెంబర్ 89ను, విజయనగరంలోని పేర్లవారి వీధిలోని పోలింగ్‌స్టేషన్ 118ను ఎంపిక చేశారు.

పిడబ్ల్యుడి మేనేజ్‌డ్ పోలింగ్‌స్టేషన్ కోసం (వికలాంగుల కోసం) నెల్లిమర్ల మండలం పూతికపేటలో పోలింగ్‌స్టేషన్ 12ను ఏర్పాటు చేశారు. మహిళా నిర్వహణ పోలింగ్‌స్టేషన్ల కింద డెంకాడ మండలం పెద తాడివాడ పోలింగ్‌స్టేషన్ 145, విజయనగరంలోని వైఎస్‌ఆర్ నగర్ పోలింగ్‌స్టేషన్ 90, రాజాం నియోజకవర్గం రాజాం మండలం మాధవ బజారులోని ఎంపిపి స్కూలు 14, బొబ్బిలి నియోజకవర్గంలో మహారానిపేట పోలీస్ స్టేషన్ నెంబర్ 33, చీపురుపల్లి నియోజకవర్గం పరిధిలో మెట్టపల్లి జెడ్‌పి హైస్కూలు పోలింగ్ స్టేషన్ నెంబర్ 165, గజపతినగరం నియోజకవర్గ పరిధిలో గంట్యాడ మండలం కరకవలస పోలింగ్ స్టేషన్ 234, శృంగవరపుకోట నియోజకవర్గంలో కొత్తవలస మండలం చింతలపాలెం ఎంపియుసి స్కూలు పోలీస్ కేంద్రం 230 ఏర్పాటు చేశారు.


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి సతీష్

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర భవిష్యత్తు

ప్రజాశక్తి-విజయనగరం కోట

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర భవిష్యత్తు అని విజయనగరం నియోజకవర్గ ఇండియా బ్లాక్ మద్దతుతో చేపోటీ చేస్తున్న అభ్యర్థి సుంకరి సతీష్ కుమార్ అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని ప్రారంభించారు. అంబేద్కర్ జంక్షన్ వద్ద ప్రారంభమైన ర్యాలీ ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా రైల్వేస్టేషన్, స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్, కన్యకా పరమేశ్వరి కోవెల, గంట స్తంభం, మూడు లాంతర్లు, కోట మీదుగా తిరిగి బాలాజీ జంక్షన్‌కు చేరుకుంది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదల బతుకులు బాగు పడతాయని తెలిపారు. ప్రత్యేకించి రైతులకు రుణమాఫీ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఉచిత విద్య, ఉపాధి కూలీలకు రూ.400 వేతనం వచ్చేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు పెన్షన్ చేస్తామన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగ సంస్థలను సర్వనాశనం చేసిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్ కంపెనీకి విక్రయించేందుకు పూనుకుందన్నారు. ఈ వినాశకర విధానాలు పోవాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గం అభ్యర్థి సరగడ రమేష్ కుమార్, నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ద్వారపూడిలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తన స్నేహితుడు ఆల్తిశేఖర్ జయంతి సందర్భంగా మిత్రులంతా ద్వారాపూడి బిసి కాలనీలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. శనివారం చలివేంద్రం ఏర్పాటు చెయ్యటం తో పాటు మజ్జిగ పంపిణీ చేశారు. బిసి కాలనీకి చెందిన యువత తమ స్నేహితుడి కోసం చేసిన ఈ సేవా కార్యక్రమాన్ని అందరూ అభినందించారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జిల్లాలో 7,83,440 మంది ఓటర్లు
- 1031 పోలింగ్ కేంద్రాలు : కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓటు హక్కును తన అంతరాత్మ ప్రబోధం మేరకు వేయాలని, ఎటువంటి ప్రలోభాలకు గురికావద్దని ఆయన కోరారు. యువత, మహిళలు, పివిటిజిలు, థర్డ్ జెండర్ ఓటు హక్కు వినియోగానికి ముందుకు రావాలని కోరారు. జిల్లాలో ఎన్నికలకు ఇప్పటి వరకు అన్ని ప్రశాంతంగా, సజావుగా ఏర్పాట్లు జరిగాయన్నారు. జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచి 144 సెక్షన్ అమల్లోకి వస్తుందని కలెక్టర్ అన్నారు. ఇంటింటి ప్రచారం చేసుకోవచ్చని చెప్పారు. సాయంత్రం 6గంటల నుంచి మద్యం దుకాణాలు కూడా మూసివేయాలని ఆదేశించారు. ఇది ఈనెల 13 సాయంత్రం 7 గంటల వరకు సాగుతుందన్నారు. జిల్లాలో 604 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని చెప్పారు. రూ. 2కోట్ల విలువగల 61 వేల మద్యం సీజ్ చేశామని, 2019 ఎన్నికల్లో సీజ్ చేసిన దానికి ఇది పది రెట్లు అని వివరించారు. నియోజక వర్గంలో ఓటు హక్కు ఉన్నవారు మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణకు 298 వాహనాలను వినియోగిస్తున్నామని చెప్పారు.

జిల్లాలో మొత్తం 7,83,440మంది ఓటర్లకు గానూ ఇప్పటి వరకు 7,63,608 ఓటరు స్లిప్ లు పంపిణీ చేసినట్టు తెలిపారు. జిల్లాలో 4529 మంది ఓటర్లు మృతి చెందినట్లు, 4,776 మంది శాశ్వతంగా వలసలు వెళ్లినట్లు, అబ్సెంట్ ఓటర్లు (ఇంటివద్ద లభ్యం కానివారు) 10527 మంది ఉన్నట్లు గుర్తించామన్నారు జిల్లాలో 1031 పోలింగు స్టేషన్లలో 883 పోలింగు స్టేషన్లు సాధారణ పోలింగు స్టేషన్లు, 219 క్రిటికల్ పోలింగు స్టేషన్లుగా గుర్తించి ఏర్పాట్లు చేశామన్నారు. 443 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసామని ఆయన చెప్పారు.

నేడు ఎన్నికల సామగ్రి పంపిణీ

ఎన్నికల సామగ్రి పంపిణీ ఆదివారం ఉదయం ప్రారంభమవు తుందని కలెక్టర్ చెప్పారు. పార్వతీపురం, పాలకొండ, కురుపాం నియోజకవర్గ కేంద్రాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోను, సాలూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోను పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు. అధికారులు, సిబ్బంది ఆదివారం ఉదయం 7గంటలకు రిపోర్ట్ చేయాలని ఆయన చెప్పారు. ఎన్నికలకు దాదాపు 6,600 మంది సిబ్బంది, 127మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. ఎన్నికల అనంతరం ఎన్నికల సామగ్రి స్వీకరణ, స్ట్రాంగ్ రూంలను ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేశారు. ఉద్యాన కళాశాలలో కౌంటింగు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లాలో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో - ములిగూడ, బత్తిలి, భామిని, పి కోనవలస, కోనేరు కూడళ్ళ లోను, గునుపూర్, పద్మాపూర్, దండిగాం, ఆర్ కె బట్టివలస, అడారు వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని కలెక్టర్ చెప్పారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్

పోలింగ్ ఏజెంట్లకు పోలీస్ వెరిఫికేషన్ అవసరం లేదు

పోలింగ్ ఏజెంట్లు నేరుగా పోలింగ్ కేంద్రాల్లోకి చేరుకోవచ్చని, పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్ అధికారి నియామక పత్రాలను జారీ చేస్తారని ఆయన చెప్పారు. పోలింగ్ ఏజెంట్లకు పోలీస్ వెరిఫికేషన్ అవసరం లేదన్నారు వెరిఫికేషన్ జరగదని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో తగాదాలు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంత నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 1150 మంది పోలీసు సిబ్బంది, ఆరు కంపెనీల కేంద్ర బలగాలను వినియోగిస్తున్నమని చెప్పారు. 56 స్ట్రైకింగ్ ఫోర్స్ బందాలు, 138 సెక్టార్ అధికారులను నియమించామని తెలిపారు. 6,100 మందిపై బైండ్ ఓవర్ కేసులు నమోదు చేశామని ఆయన చెప్పారు. ఎన్నికల వేళ ఎవరూ సమస్యలు, అల్లర్లు సృష్టించారాదని కోరారు. అల్లర్లు సష్టించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఓటు లేని ఇతర ప్రాంతాలకు చెందిన వారు జిల్లా విడిచి వెళ్లాలని ఆయన స్పష్టం చేశారు.

అన్ని స్థానాల్లోనూ విజయం మాదే

వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలో అన్ని స్థానాలలో వైసిపి జెండా ఎగర వేయబోతున్నా మని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర పరిధిలో మూడు సిద్ధం సభలు ఏర్పాటు చేసుకొని జగన్ ప్రచారం నిర్వహించి, ఉమ్మడి విజయనగరం శ్రీకాకుళం జిల్లాలలో 19 శాసనసభ, 5 పార్లమెంట్ సభ్యులు విస్తతంగా ప్రచారం నిర్వహించామని తెలిపారు. తప్పకుండా అన్ని స్థానాలలో వైసిపి జెండాను ఎగరవేయబోతున్నామని తెలిపారు. చంద్రబాబు పాలన, జగన్ పాలన మధ్య వ్యత్యాసం ప్రజలందరికీ వివరించామని, 2024 మేనిఫెస్టో కూడా ప్రజలను ఆకర్షించిందని తెలిపారు. మళ్ళీ జగన్ వస్తేనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం మీద విషం చిమ్మడమే పనిగా కూటమి పెట్టుకుందని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ మీద అనేక ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.. 14 ఏళ్ళ సిఎంగా పనిచేసి రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం చేయని వ్యక్తి చంద్రబాబు, ఆయనలా మోసపూరిత హామీలు జగన్ ఏనాడూ ఇవ్వలేదని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి జగన్ కట్టుబడి ఉన్నారని, గత పాలకులు ఎవరూ చేయని విధంగా ఈ ప్రాంతానికి అన్ని విధాలుగా తోడ్పాటు అందించారని తెలిపారు. ప్రజలెవరూ టిడిపి కూటమి మాయ మాటలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే జగన్ కి మరోసారి మద్దతివ్వాలని కోరారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

రఘుమండలో ఎమ్మెల్యే ప్రచారం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని రఘుమండ గ్రామంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనకు ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి వేయించి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డెంకాడ ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, సర్పంచ్ విష్ణు, మాజీ సర్పంచ్ నానాజీ, గ్రామ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్ ద్వారా ఎన్నికల సిబ్బంది కేటాయింపు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందిని కేటాయించారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా, సీతారామ్ జాట్ సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి కలెక్టరేట్ ఎన్ఐసి కేంద్రంలో శనివారం ఈ ప్రక్రియ నిర్వహించారు. చివరి కంప్యూటర్ ర్యాండమైజేషన్ ద్వారా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు నియమించిన పిఒలు, ఎపిఒలు, ఒపిఒలను కేటాయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఇవిఎంల నోడల్ అధికారి బి.ఉమాశంకర్, ఎన్ఐసి డిఐఒ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి పోలింగ్ కేంద్రాలు కేటాయిస్తున్న అధికారులు